

రూ.51,116 విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి బల భద్ర రాయుడు కుటుంబం (రాజోలు) సోమ వారం రూ.51,116 విరాళం సమర్పించింది.



వేంకటేశ్వరునికి రూ.లక్ష

దేవరపల్లి: స్థానిక శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి వైస్ ఎంపీపీ కొర్లపాటి అరుణ, సుబ్రహ్మణ్యం దంపతులు (గౌరీపట్నం) సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

గరిష్టం/కనిష్టం
39.0°/26.3°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	37.0	27.0
కాకినాడ	37.0	26.3
అమలాపురం	39.0	27.0

న్యూస్‌రీల్

6 వరకూ డ్రోన్‌లు వినియోగించరాదు

కాకినాడ సిటీ: వచ్చే నెల 4న **జరిగే ఓట్ల లెక్కిం**పు అనంతరం నిర్వహించే **విజయోత్సవ** ర్యాలీల సందర్భంగా అభ్య**ర్థులు, రాజకీయ** పార్టీలు జేఎన్‌టీయూకే వద్ద, **జిల్లాలో రెడ్** జోన్స్‌గా గుర్తించిన ప్రాంతా**ల్లో వీడియోలు,** ఫొటోలు తీసేందుకు డ్రోన్‌**లు వినియోగించ**రాదని జిల్లా ఎన్నికల **అధికారి, కలెక్టర్** జె.నివాస్ తెలిపారు. ఈ ఆదేశాలను అందరూ కచ్చితంగా పాటించాలన్నారు. జిల్లాలో వచ్చే నెల 6వ తేదీ వరకూ ఎటువంటి డ్రోన్ కెమెరాలూ వినియోగించరాదని స్పష్టం చేశారు. ఈ నిబంధనను అతిక్రమించిన వారిపై ఎన్నికల నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణ సామగ్రి భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

ఈఏపీ సెట్‌కు 97.67శాతం హాజరు

బాలాజీ చెరువు (కాకినాడ సిటీ): జిల్లాలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లో ఏపీ ఈఏపీ సెట్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఈ ఆన్‌లైన్ పరీక్షకు ఉదయం 1,079 హాజరవగా 33 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 2,176 మంది హాజరు కాగా, 52 మంది గైర్హాజరయ్యారని సెట్ కన్వీనర్ వెంకటరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 28,899 మంది హాజరు కాగా 1,778 మంది పరీక్ష రాయలేదని వివరించారు.

ముద్రగడను కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు



ముద్రగడను కలసిన ఒమ్మంగి గ్రామస్తులు

కిర్లంపూడి: కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం, ఆయన కుమారుడు గిరిబాబును పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రత్తిపాడు నియోజకవర్గం ఒమ్మంగి నుంచి సుమారు 150 మంది గ్రామస్తులు, కిర్లంపూడి, జగపతినగరం, వేలంక గ్రామాలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఈ నెల 13న ఆయా గ్రామాల్లో జరిగిన ఎన్నికల తీరు, వైఎస్సార్ సీపీకి నమోదైన ఓటింగ్ వివరాలను ముద్రగడ అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై ప్రతిపక్షాలు చేసిన దాడులను పలువురు ముద్రగడ దృష్టికి తీసుకుని వచ్చారు.

జంతు సంరక్షణ చట్టాల అమలుకు నోడల్ అధికారి


కాకినాడ క్రైం: హైకోర్టు ఆదేశాల మేరకు జంతు సంరక్షణ చట్టాల అమలుకు జిల్లా ప్రత్యేక నోడల్ అధికారిగా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావును నియమిస్తూ ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జంతు అక్రమ రవాణా, అక్రమ వధ వంటి అంశాల్లో ఎటువంటి సమాచారం అందినా ప్రజలు నేరుగా 94407 96501 నంబరుకు ఫోన్ చేసి, నోడల్ అధికారికి తెలియజేయాలని ఎస్పీ కోరారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

కొబ్బరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

అంబాజీపేట: సంక్షోభంలో ఉన్న కొబ్బరి రైతులను ఆదుకునేందుకు నాఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకొంది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ డిప్యూటీ కార్యదర్శి సంజయ్‌కుమార్ సోమవారం ఆదేశాలు జారీ చేసినట్టు ఆయిల్‌ఫెడ్ మేనేజర్ యు.సుధాకరరావు తెలిపారు. ఈ నెల 15న రాష్ట్ర ప్రభుత్వం రాసిన లేఖ ఆధారంగా 8 వేల మెట్రిక్ టన్నుల మిల్లింగ్ కోప్రాను 6 నెలల వ్యవధిలో కొనుగోలు చేయనున్నట్టు పేర్కొన్నారు. గత ఏడాది బాల్ కోప్రాను రూ.11,750కు కొనుగోలు చేయగా ప్రస్తుతం రూ.12 వేలకు కొనుగోలు చేస్తారన్నారు. మిల్లింగ్ కోప్రాను రూ.10,860కు గత ఏడాది కొనుగోలు చేయగా ఈ ఏడాది రూ.11,120కు కొనుగోలు చేస్తారని వివరించారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అవసరమైన అనుమతులు తీసుకున్న తరువాతే కొనుగోలు తేదీ ప్రకటించాలని సంజయ్‌కుమార్ సూచించారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించే ముందు కేంద్ర నోడల్ ఏజెన్సీ అన్ని రకాల వసతులూ పరిశీలించి తగిన నివేదిక రూపొందించాలని సూచించారు. ఇందుకు సంబంధించిన జీఓ కాపీని రాష్ట్ర హార్టికల్చర్ కమిషనర్ శ్రీధర్‌కు పంపినట్లు సంజయ్‌కుమార్ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

గురి చూసి కొట్టాలిరా..

- ఉత్సాహంగా రైఫిల్, పిస్టల్ షూటింగ్ శిక్షణ
- డీఎస్ఏ మైదానంలో ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహణ
- జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణింపు
- వివిధ సంస్థల్లో పలువురికి ఉద్యోగాలు



టార్గెట్ ఎయిమ్ చేస్తున్న క్రీడాకారుడు



డీఎస్ఏ రైఫిల్ షూటింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): దీపావళి వచ్చిందంటే చాలు.. తుపాకులు పట్టుకుని టేపులు పేల్చుతూ ఆ చప్పుడు విని చిన్నారులు ఎంతో సంబర పడిపోతూంటారు. చిన్నప్పుడు దొంగా–పోలీసు ఆట ఆడేటప్పుడు పోలీసుగా ఉన్న కుర్రాడు బొమ్మ తుపాకి పట్టుకుని డిష్యూం డిష్యూం అని శబ్దాలు చేస్తూ నిజంగానే తుపాకితో కాల్చుతున్నట్లు ఊహించుకుని ఆనందపడిపోతూంటాడు. ఇటువంటి సన్నివేశాలు చాలా మందికి చిన్ననాటి గురుతులే. సినిమాల్లో హీరో తుపాకి పట్టుకుని విలన్ గ్యాంగ్‌లపై కాల్పులు జరుపుతూంటే అందరికీ ఉత్సాహంగానే ఉంటుంది. అలా చూసిన చాలా మంది తాము కూడా షూటింగ్ నేర్చుకోవాలని, వివిధ పోటీల్లో పాల్గొని గుర్తింపు తెచ్చుకోవాలని అనుకుంటూంటారు. అటువంటి వారి కలలను సాకారం చేస్తోంది జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) క్రీడా మైదానంలో జరుగుతున్న రైఫిల్ షూటింగ్ వేసవి శిక్షణ.

షూటింగ్‌లో దేశానికి పతకాలు సాధించిన అభినవ్ బింద్రా, విజయ్, జీతూరాయి, అంజలీ భగవత్‌ల స్ఫూర్తితో రైఫిల్ షూటింగ్‌పై ఉన్న మక్కువతో కోచ్ మహ్మద్ అలీషా షరీఫ్ ఈ శిక్షణ ప్రారంభించారు. దీనికోసం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) నిధులతో 2018లో రైఫిల్, పిస్టల్ షూటింగ్ అకాడమీ ఏర్పాటు చేశారు. ఈ అకాడమీ ద్వారా ఇప్పటి వరకూ 1,500 మంది షూటింగ్‌లో శిక్షణ పొందారు. వీరిలో పలువురు ప్రభుత్వ, అగ్నిమాపక, డిఫెన్స్ రంగాలతో పాటు ప్రైవేటు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరికొంత మంది ఇంజినీరింగ్, మెడిసిన్ చదువుతున్నారు. ఈ అకాడమీలో శిక్షణ పొందిన వారిలో 278 మంది వివిధ జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి, 39 బంగారు, 162 రజత, 89 కాంస్య పతకాలు సాధించడం విశేషం.

వేసవి శిక్షణ ఇస్తున్నారిలా..

జిల్లా క్రీడా మైదానంలో ఈ నెల 15న వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఇక్కడి రైఫిల్, పిస్టల్ షూటింగ్ అకాడమీలో సుమారు 15 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 9, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకూ వీరికి శిక్షణ ఇస్తున్నారు. 10 మీటర్ల రేంజ్ ఉన్న ఈ అకాడమీలో క్రీడాకారులకు రైఫిల్ షూటింగ్‌లో కోచ్ షరీఫ్ మెళకువలు నేర్పిస్తున్నారు. అకాడమీలో రెండు గన్‌లు, ఒక తుపాకి ఉన్నాయి. వీటితోనే హ్యాండ్ పవర్, బ్యాలెన్స్, ఐసైట్, స్టాండింగ్ పొజిషన్లలో షూటింగ్ శిక్షణ ఇస్తున్నారు. క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇవ్వాలంటే శాప్ నుంచి అంతర్జాతీయ స్థాయి రైఫిల్స్ 4, పిస్టల్స్ 4, ఇతర షూటింగ్ పరికరాలు కావాలి. ప్రస్తుతం ఐదు ఎలక్ట్రిక్ టార్గెట్‌లు వాడుతున్నారు. వీటి స్థానంలో ఆధునిక సిస్టమ్ టార్గెట్‌లు ఏర్పాటు చేస్తే మరిన్ని పతకాలు సాధించడానికి అవకాశం ఉంటుందని కోచ్ షరీఫ్ చెబుతున్నారు. రైఫిల్, పిస్టల్ పోటీల్లో వినియోగించే ఆయుధాలను పెసివోల్, వాల్‌టేర్ కంపెనీలు తయారు చేస్తున్నాయి. ప్రారంభ దశలో ఉన్న వారికి రూ.13 వేల నుంచి రూ.3.5 లక్షల వరకూ వీటి ధరలు న్నాయి. రైఫిల్ షూటింగ్ సూట్ రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకూ మార్కెట్‌లో లభ్యమవుతోంది. షూ రూ.27 వేల నుంచి అందుబాటులో ఉంది.

ఏకాగ్రత ఉండాలి



రైఫిల్ షూటింగ్ ఏకాగ్రతతో కూడుకున్న క్రీడ. ఇందులో రాణించాలంటే సహనం, ఓపిక ఉండాలి. టార్గెట్ పైనే దృష్టి సారిస్తే పతకం సాధించడం సులువే. ఈ క్రీడలో రాణించే వారికి విద్య, ఉద్యోగావకాశాలు అధికంగా ఉన్నాయి.

– మహ్మద్ అలీషా షరీఫ్, డీఎస్ఏ రైఫిల్ షూటింగ్ కోచ్

డిఫెన్స్‌లో ఉద్యోగం సాధించాలని..



పీఆర్ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాను. జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్‌లో పతకం సాధించడం నా లక్ష్యం. డిఫెన్స్ సర్వీసెస్‌లో ఉద్యోగం సాధించడం కోసం సమ్మర్ క్యాంప్‌లో షూటింగ్ నేర్చుకుంటున్నాను.

– ఎన్.పవన్‌కుమార్

ఐఏఎస్ కావడమే లక్ష్యం



ఇంటర్ సెకండియర్ చదువుతున్నాను. డీఎస్ఏలో నాలుగు సంవత్సరాలుగా శిక్షణ పొందుతున్నాను. రాష్ట్ర స్థాయిలో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించాను. ఐఏఎస్ సాధించి, స్థిరపడాలన్నది నా లక్ష్యం.

– మొహియుద్దీన్ షేక్, జాతీయ స్థాయి క్రీడాకారుడు

సంపర నుంచి వస్తున్నాను



రైఫిల్ షూటింగ్ నేర్చుకోవడానికి నేను ప్రతి రోజూ సంపర గ్రామం నుంచి వస్తున్నాను. కోచ్ సమీర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నాను. కాకినాడలో డిగ్రీ చదువుతున్నాను. చిన్నప్పటి నుంచీ రైఫిల్ షూటింగ్ అంటే ఇష్టం. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నది నా లక్ష్యం.

– నాగిరెడ్డి బాలా త్రిపురసుందరీదేవి, డిగ్రీ విద్యార్థిని

ఒక కోర్సు చదివితే మరో కోర్సుకు సర్టిఫికెట్

కలెక్టరేట్ వద్ద విద్యార్థుల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న పీవీఆర్ ట్రస్ట్ కళాశాల విద్యార్థులు

కాకినాడ సిటీ: తాము ఒక కోర్సు చదివితే, కాకినాడ పైడా కళాశాలలో (పీవీఆర్ ట్రస్ట్) మరో కోర్సుకు సర్టిఫికెట్ ఇస్తున్నారని, దీని వల్ల తాము చదివిన చదువుకు అర్థం లేకుండా పోయిందని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ కళాశాల విద్యార్థులు జిల్లా కలెక్టర్ జె.నివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. పీవీఆర్ ట్రస్ట్ డిగ్రీ కాలేజీకి చెందిన తామంతా బీఎస్సీ కోర్సు చేస్తే వారు ఒకేషనల్ కోర్సు సర్టిఫికెట్ అందిస్తున్నారని వివరించారు. మూడేళ్లగా ఒక్కొక్కరం రూ.3.5 లక్షల చొప్పున ఫీజు చెల్లించి చదువుకున్నామన్నారు. తమ ముందు బ్యాచ్ విద్యార్థులు బీఎస్సీ చదివితే వారికీ ఒకేషనల్ కోర్సు చేసినట్లు సర్టిఫికెట్ ఇచ్చారని, ఇప్పుడు ఆ సర్టిఫికెట్ చెల్లదని వైద్య, ఆరోగ్య శాఖ చెప్పడంతో వారికి తీరని నష్టం కలిగిందని పేర్కొన్నారు. తమకు కూడా నష్టం జరుగుతుందేమోననే భయంతో కళాశాల యాజమాన్యాన్ని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కాగా, విద్యార్థుల సమస్యను బీజేపీ నేతలు గట్టి సత్యనారాయణ, చిలుకూరి రామ్‌కుమార్ తదితరులు అడిగి తెలుసుకున్నారు. వారికి న్యాయం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

రథోత్సవంలో అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలి




రథాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సత్యనారాయణ. చిత్రంలో ఈఓ రామచంద్ర మోహన్ తదితరులు

అన్నవరం: వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని ఈ నెల 22న నూతన రథంపై ఊరేగించే సమయంలో అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. రథాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఆయనకు రథం వివరాలను ఈఓ కె.రామచంద్ర మోహన్ వివరించారు. ఈ రథాన్ని రూ.1.08 కోట్లతో తయారు చేయించిన విషయం విదితమే. దేవస్థానంలో సుమారు 36 అడుగుల ఎత్తు, 14.6 అడుగుల వెడల్పు, 21 అడుగుల పొడవు కలిగిన పెద్ద రథం ఇది. దీనికి ఈ నెల 16న ట్రయల్ రన్ వేశామని ఈఓ తెలిపారు. కొన్ని సాంకేతిక ఇబ్బందులు మినహా ట్రయల్ రన్ విజయవంతమైందని చెప్పారు. రథం జాకీకి సంబంధించిన మోటార్ సామర్థ్యం చాలలేదని, దీనిని మార్చి రెండు హార్స్ పవర్ మోటార్ బిగించామని వివరించారు. ఆ మోటార్‌ను జనరేటర్ సహాయంతో నిర్వహించేలా ఏర్పాట్లు చేశామనిన్నారు. రథంతో పాటు జనరేటర్ కూడా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథరాజు, ఏఈఓ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యదేవుని కల్యాణోత్సవాలు



సత్యదేవుడు, అమ్మవార్లకు అరుంధతీ నక్షత్ర దర్శనం చేయిస్తున్న పండితులు



రావణబ్రహ్మ వాహనంపై సత్యదేవుని ఊరేగింపులో దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్

- వేడుకగా అరుంధతీ నక్షత్ర దర్శనం
- రావణబ్రహ్మ వాహనంపై ఊరేగింపు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన సోమవారం సాయంత్రం నవదంపతులు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు దర్బారు మండపంలో స్థాలీపాక హోమాలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లను తూర్పు రాజగోపురం ముందున్న ఆవరణలోకి ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు పండితులు అరుంధతీ నక్షత్రాన్ని చూపించి, పూజలు చేశారు. కార్యక్రమంలో వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, యనమండ్ర శర్మ, గంగాధరభట్ల గంగబాబు, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ, దేవస్థానం వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వర శర్మ, వైదిక కమిటీ సభ్యుడు చామర్తి కన్నబాబు, వ్రత పురోహితులు నాగాభట్ల రవిశర్మ, పాలంకి పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ఊరేగింపు

సత్యదేవుడు, అమ్మవారిని రావణబ్రహ్మ వాహనం మీద ఘనంగా ఊరేగించారు. రాత్రి తొమ్మిది గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా కొండ దిగువన ఉన్న తొలి పావంచా వద్దకు తీసుకు వచ్చారు. అక్కడ సర్వాంగసుందరంగా అలంకరించిన రావణబ్రహ్మ వాహనంపై స్వామి, అమ్మవార్లను వేంచేయించి, పండితులు పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పూజలు చేశారు. అనంతరం రావణబ్రహ్మ వాహనం ముందు కొబ్బరి కాయ కొట్టి ఊరేగింపు ప్రారంభించారు. రత్నగిరి తొలి పావంచా వద్ద నుంచి ఆంధ్రా బ్యాంక్ సెంటర్ వరకూ.. అక్కడి నుంచి తిరిగి తొలి పావంచా వరకూ ఈ ఊరేగింపు కోలాహలంగా సాగింది. ఈ సందర్భంగా పలువురు కళాకారులు ప్రదర్శించిన జానపద నృత్యాలు, ఇతర కళారూపాలు అధిక సంఖ్యలో తరలివచ్చిన గ్రామస్తులను, భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ ఊరేగింపును పురస్కరించుకుని గ్రామంలోకి భారీ వాహనాలను అనుమతించలేదు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఊరేగింపు సాగినంతసేపూ బాణసంచా కాల్చారు.



రావణబ్రహ్మ వాహనంపై సత్యదేవుని ఊరేగింపునకు తరలివచ్చిన భక్తులు

అన్నవరంలో నేడు

తెల్లవారుజామున 3.00 : సుప్రభాత సేవ.

ఉదయం 8.00 : చతుర్వేద పారాయణ.

మధ్యాహ్నం 2.30 : అనివేటి మండపంలో సత్యదేవుడు, అమ్మవారి సమక్షంలో సరస్వతీ పూజ. వేద పండిత సదస్యం, పండిత సత్కారం.

రాత్రి 9.00 : కొండ దిగువన పొన్నచెట్టు వాహనంపై సత్యదేవుడు, అమ్మవారి ఊరేగింపు.

ఉదయం 7.00 – 10.00, సాయంత్రం 5.00 – రాత్రి 11.00 : రత్నగిరి కళావేదిక మీద, కొండ దిగువన సాంస్కృతిక కార్యక్రమాలు.



రావణబ్రహ్మ వాహనంపై కొలువుదీరిన స్వామి, అమ్మవారు

స్ట్రాంగ్ రూముల భద్రతపై నిరంతర పర్యవేక్షణ

- సందేహాలుంటే అధికారులను సంప్రదించాలి
- కలెక్టర్ నివాస్



స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతపై చర్చించుకుంటున్న కలెక్టర్ నివాస్, ఎస్పీ సతీష్ కుమార్

కాకినాడ సిటీ: పోలింగ్ అనంతరం ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూముల భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. జేఎన్‌టీయూకేలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమును, స్టూడెంట్స్ క్యాంటీన్‌పై ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాల కంట్రోల్ రూమును ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, రిటర్నింగ్ అధికారుల(ఆర్‌ఓ)తో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూముల భద్రత వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాకు సంబంధించిన ఒక లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రిని వర్సిటీలోని స్ట్రాంగ్ రూముల్లో సురక్షితంగా భద్రపరిచామని తెలిపారు. వీటికి రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో సీలు వేశామన్నారు. స్ట్రాంగ్ రూములను నిరంతరం సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. స్ట్రాంగ్ రూముల భద్రతను పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు పరిశీలించేందుకు వీలుగా స్టూడెంట్స్ క్యాంటీన్ పైన ఉన్న యోగా సెంటర్‌లో సీసీ టీవీ కెమెరాల కంట్రోల్ రూము ఏర్పాటు చేశామని తెలిపారు. స్ట్రాంగ్ రూముల భద్రతను ఆయా ఆర్‌ఓలతో పాటు షిఫ్టుల పద్ధతిలో ఒక గెజిటెడ్ అధికారి, ఒక పోలీస్ అధికారి, ఇతర సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తున్నారని వివరించారు. స్ట్రాంగ్ రూముల భద్రతపై సందేహాలుంటే ఆయా అభ్యర్థులు, ఏజెంట్లు నేరుగా అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

వచ్చే నెల 4న జరిగే ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ నివాస్ చెప్పారు. ఆ రోజున రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏజెంట్ల వాహనాల పార్కింగ్, పాస్‌లు తదితర అంశాలపై పూర్తి సమాచారం తెలియజేస్తామని తెలిపారు. పాస్‌లు ఉన్నవారికి మాత్రమే లోపలకు అనుమతి ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం గెలుపొందిన అభ్యర్థులు ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

బందోబస్తు కట్టుదిట్టం

ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నామని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. జేఎన్‌టీయూకేలోని స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. డీఎస్పీ, సీఐ, ఎస్సై ర్యాంక్ అధికారులతో పాటు మరో ముగ్గురు అధికారులు సమన్వయ లోపం లేకుండా స్ట్రాంగ్ రూముల భద్రతను పర్యవేక్షిస్తున్నారని వివరించారు. ఓట్ల లెక్కింపు తర్వాత విజయోత్సవ ర్యాలీలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాకినాడ సిటీ ఆర్‌ఓ జె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

23న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

కాకినాడ సిటీ: ఈ నెల 23వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం, స్థాయీ సంఘాల సమావేశాలు కాకినాడ జిల్లా పరిషత్‌లోని జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో తప్పక హాజరు కావాలన్నారు. ఆయా శాఖలు అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష నిర్వహించనున్నట్టు సీఈవో శ్రీరామమూర్తి తెలిపారు.

ఆ ఊరిగాయల రుచే వేరు!

- పచ్చళ్ల తయారీలో ఆ గ్రామాలు అదుర్స్
- విదేశాలకు సైతం ఎగుమతి
- పలు కుటుంబాలకు జీవనోపాధి



ఆవకాయ కోసం తయారైన మామిడిముక్కలు



పచ్చళ్ల కోసం తయారైన మామిడిముక్కలు



తయారైన ఆవకాయ

ఆత్రేయపురం: ఒక్కొక్క వంటకానికి ఒక్కొక్క ఊరు ప్రసిద్ధి. కానీ ఊరగాయల తయారీకి మాత్రం ఆ గ్రామాలే పెట్టింది పేరు. అక్కడ నుంచి ఊరగాయలు ఇతర దేశాలకు కూడా ఎగుమతి అవుతాయి. ఆ గ్రామాల వారు పచ్చళ్ల తయారీతో జీవనోపాధి పొందడంతో పాటు పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు. ఆహా ఏమి రుచి తినరా మైమరచి అన్నట్టు... తినేవారికి నోరూరించే పచ్చళ్ల తయారీకి ఆత్రేయపురం మండలం ప్రసిద్ధి చెందింది. ఆవకాయకు ఆంధ్రా పెట్టింది పేరు కాగా కోనసీమలోని ఆత్రేయపురం, నార్కెడిమిల్లి, అంకంపాలెం, ఉచ్చిలి, ర్యాలి గ్రామాలు పచ్చళ్ల తయారీకి ప్రసిద్ధి చెందాయి. ఆవకాయ పచ్చడి తయారీలో ఈ గ్రామాల వారు మామిడికాయలకు కారం, నూనె, ఆవపిండి, ఉప్పు, వెల్లుల్లి, మెంతులు తదితర మసాలా దినుసులతో పాటు, ఆప్యాయతలు రంగరించి సొంత వాడకానికి చేసినట్టుగా పచ్చళ్లు తయారు చేస్తుంటారు. దీంతో వీటి ముందు కార్పొరేట్ కంపెనీల పచ్చళ్లు సైతం దిగదుడుపే అవుతాయి.


కుటీర పరిశ్రమగా..

ఆత్రేయపురం మండలంలో నార్కెడిమిల్లి, ఆత్రేయపురం, అంకంపాలెం, ఉచ్చిలి, ర్యాలి గ్రామాల్లో సుమారు 15 వేలకు పైగా జనాభా ఉండగా 20 శాతం మంది పచ్చళ్ల తయారీనే కుటీర పరిశ్రమగా ఎంచుకుని జీవనోపాధి పొందుతున్నారు. సుమారు వెయ్యి కుటుంబాల వారు వేసవిలో పచ్చడి తయారు చేసి ఏడాది పొడవునా అమ్మకాలు సాగిస్తుంటారు. దీంతో పాటు సీజన్ల వారిగా ఏడాది పొడవునా వివిధ రకాల పచ్చళ్లు తయారు చేస్తుంటారు. ఆవకాయ, తీపి ఊరగాయ, మాగాయ, టమాటా, అల్లం, ఎండు మిరపకాయ, చింతకాయ, ఉసిరి, గొంగూర, నిమ్మకాయ, కాలీఫ్లవర్, ములక్కాడ పచ్చళ్లను ఆయా సీజన్లను బట్టి తయారు చేస్తుంటారు. ఎంచుకున్న కూరగాయలతో పాటు తగినంత ఉప్పు, కారం, వెల్లుల్లి, పోపులు, నూనె వంటి దినుసులు వేసి వీరి చేతులతో కలిపితే ఆ రుచులే వేరు. మహిళలు తయారు చేసిన పచ్చళ్లను కుటుంబంలోని పురుషులు రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు తీసుకువెళ్లి విక్రయిస్తుంటారు. కడప, పులివెందుల, విశాఖపట్నం, హైదరాబాద్, తిరుపతి, బెంగళూరులో ఈ పచ్చళ్లకు మంచి పేరుంది. విదేశీ గడ్డపై కూడా ఈ పచ్చళ్లు నోరూరిస్తూ ఆంధ్రా సత్తా చాటుకున్నాయి. నార్కెడిమిల్లిలో సుమారు 170 డ్వాక్రా సంఘాలు పావలా వడ్డీ రుణాలతో పచ్చళ్లు తయారు చేస్తూ ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారు.

పెరిగిన ధరలతో తయారీ భారం

ఆవకాయ తయారు చేసేందుకు ఉపయోగించే మామిడికాయలు, ఇతర దినుసుల ధరలు పెరగడంతో పచ్చళ్ల తయారీ పెనుభారమౌతోందని ఈ పరిశ్రమపై ఆధారపడిన వారు అంటున్నారు. మామిడికాయ టన్ను ఒక్కింటికి రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు చెల్లిస్తుండగా ఎండుమిర్చి క్వింటాల్ రూ.18 వేల నుంచి రూ.20 వేలు, క్వింటాల్ ఉప్పు బస్తా రూ.400, 20 లీటర్ల నూనె డబ్బా రూ.3,500, ఆవాల బస్తా రూ.700, మెంతులు బస్తా రూ.900, వెల్లుల్లి క్వింటాల్‌కు రూ.15వేలు పలుకుతుందని చెబుతున్నారు. దీనికితోడు కూలీ ధరలు విపరీతంగా పెరగడంతో టన్ను మామిడికాయలతో తయారు చేసిన పచ్చడికి సుమారు రూ.65 వేలు ఖర్చు అవుతోంది. ఈ గ్రామాల వారు ఇంటి వద్ద కేజీ పచ్చడి రూ.225 నుంచి రూ.300కి విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. వీరి వద్ద నుంచి కొనుగోలు చేసిన చిరు వ్యాపారాలు రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాల్లో విక్రయించి జీవనోపాధి పొందుతారు. సీజన్ వారీగా పచ్చళ్లను తయారు చేసి ఏడాది పొడవునా దాన్ని భద్రపరచి అమ్మకాలు సాగిస్తుంటారు. అందుకు గాను వేసవిలో తమకున్న పరపతినంతా ఉపయోగించి మూడు వేల కుటుంబాల వారు ప్రైవేటు వ్యక్తుల వద్ద, బ్యాంకుల వద్ద రుణాలు తెచ్చి పచ్చళ్లు తయారు చేస్తారు. సగటున ఒక్కొక్క కుటుంబం వారు పది టన్నుల మామిడికాయలు దిగుమతి చేసుకుంటారు. అందుకే వేసవిలో ఈ గ్రామాల్లో ఏ ఇంట చూసినా మామిడిరాశులు కనుల విందు చేస్తాయి. మూడు వేల కుటుంబాల వారు సుమారు 30 వేల టన్నుల వరకు మామిడికాయలను దిగుమతి చేసుకుంటారు.

పచ్చళ్ల తయారీతో ఉపాధి



పచ్చడి తయారీతో జీవనోపాధి పొందడంతో పాటు పలువురికి ఉపాధి కల్పిస్తున్నాను. గత 30 ఏళ్లుగా పచ్చడి తయారీలో అనుభవం ఉంది. – సుంకర బ్రహ్మానందం, అంకంపాలెం

వేసవిలో తయారు చేసి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తాను



ఏటా వేసవిలో పెట్టుబడులు పెట్టి పచ్చళ్లు తయారు చేస్తాను. ఆ పచ్చళ్లను హైదరాబాద్, వైజాగ్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో విక్రయిస్తూ పలువురి ఉపాధికి తోడ్పడుతున్నాను.

– అడ్డాల రమేష్, ఆత్రేయపురం

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

తుని: స్థానిక జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైలు నుంచి జారిపడి (60) ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. సోమవారం విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు నుంచి జారిపడడంతో తల, కాళ్లకు బలమైన గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. నీలంరంగు ప్యాంటు, గులాబీ రంగు ఫుల్ చేతుల చొక్కా ధరించి ఉన్నాడన్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వరుణుడు, సూర్యునికి బూరెల నివేదన



బూరెలను ఆకాశం వైపు ఎగురవేస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ దంపతులు. చిత్రంలో ఈఓ రామచంద్రమోహన్, వేద పండితులు

- వర్షం వలన ఆటంకం లేకుండా సత్యదేవుని కల్యాణం జరిగినందుకు కృతజ్ఞతలు
- ఆకాశం వైపు బూరెలు ఎగురవేసిన దేవదాయశాఖ కమిషనర్ దంపతులు

అన్నవరం: వర్షం కురవకుండా రత్నగిరి వాసుడు సత్యదేవుని దివ్యకల్యాణం ఆదివారం రాత్రి నిర్విఘ్నంగా జరగడంపై వరుణ దేవునికి, సూర్యభగవానుడికి కృతజ్ఞతలు తెలియచేస్తూ దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ దంపతులు సోమవారం ఉదయం బూరెలు నివేదించారు. కమిషనర్ దంపతులు సోమవారం ఉదయం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఆలయంలోని దిగువన గల యంత్రాలయంలో గల సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తూర్పు రాజగోపురం వద్దకు వచ్చి సూర్యభగవానుడు, వరుణదేవునికి బూర్లు నివేదించి ఆకాశం వైపు గాలిలో ఎగురవేశారు. వాటిని భక్తులు ఏరుకుని ప్రసాదంగా స్వీకరించారు. ఆదివారం సాయంత్రం వర్షం కురియడంతో సత్యదేవుని కల్యాణ మహోత్సవానికి ఎక్కడ ఆటంకం ఏర్పడుతుందో అని అందరూ ఆందోళన చెందారు. రాత్రి ఏడు గంటలకు కూడా ఆకాశంలో దట్టమైన మేఘాలతో కూడిన వాతావరణం ఉండడంతో గ్రామంలో స్వామి, అమ్మవార్ల ఊరేగింపు రద్దు చేశారు. అయితే రాత్రి కల్యాణ సమయంలో వర్షం కురవకపోవడంతో స్వామివారి కల్యాణం నిర్విఘ్నంగా వార్షిక కల్యాణ వేదిక మీద ఘనంగా నిర్వహించారు. మిగిలిన ఐదు రోజులు కూడా కరుణించాలని సోమవారం సూర్యభగవానుడిని వేడుకున్నారు. దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్, పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తాడిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



లక్ష్మణరావు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కొత్తపల్లి: తాడిచెట్టుపై కల్లు గీసేందుకు ఎక్కిన కార్మికుడు మృతి చెందిన ఘటన సోమవారం కొమరగిరిలో జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కొమరగిరి శివారు వెంకటరాయపురానికి చెందిన కల్లుగీత కార్మికుడు శీలం లక్ష్మణరావు (53) సోమవారం ఉదయం కల్లు గీసేందుకు తాడిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు తాడిచెట్టుపై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మణరావుకు భార్య, ముగ్గురు ఆడ పిల్లలు, ఒక అబ్బాయి ఉన్నారు. అతని కూలిపని ఆధారంగా బతికే ఆ కుటుంబ సభ్యులు లక్ష్మణరావు మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. హెడ్ కానిస్టేబుల్ జె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



లక్ష్మణరావు (ఫైల్)

వృద్ధురాలిపై అత్యాచారం

గొల్లప్రోలు: పట్టణంలో ఊరి చివర పొలంలో నివసిస్తున్న వృద్ధురాలిపై ఇద్దరు యువకులు అత్యాచారం చేసినట్టు ఆమె కుమారుడు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఊరి చివర పొలంలో మకాంలో నిద్రిస్తున్న వృద్ధురాలిపై అదే పట్టణానికి చెందిన కోటా శేఖర్, కాలబోయిన గంగాధర్ అత్యాచారానికి పాల్పడినట్టు ఆమె కుమారుడు నాయుడు దొరబాబు సోమవారం గొల్లప్రోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ బాలాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలియజేశారు.

సెంట్రల్ జైలుకు బయోడైవర్సిటీ కన్జర్వేషన్ అవార్డు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలును బయోడైవర్సిటీ కన్జర్వేషన్ అవార్డు –2024 వరించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు ఈ అవార్డును ఈ నెల 22న అంతర్జాతీయ వైవిధ్య పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అందజేయనున్నారు. సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ సోమవారం ఆ వివరాలను వెల్లడించారు. సెంట్రల్ జైలులో పర్యావరణ సమతుల్యతకు వివిధ రకమైన మొక్కలు, వృక్షజాతులు, పక్షులను పెంచుతున్నట్టు పేర్కొన్నారు. పురాతన కట్టడాలు, సంస్కృతి పరిరక్షణ, సోలార్ వంటి సహజ వనరుల వినియోగం, నీటి వనరుల సంరక్షణ, తోటలకు సేంద్రియ ఎరువుల వాడకం, పర్యావరణ కాలుష్యం లేకుండా కుండల్లో మంచినీరు, ఖద్దరు దుస్తుల తయారీ, కొబ్బరి నారతో తాళ్లు, ఫ్లోర్ మ్యాట్స్, సంప్రదాయ పద్ధతులు పాటించడం వంటివి గుర్తించి ఈ అవార్డును ప్రకటించినట్టు ఆయన తెలిపారు.